ఎడిటోరియల్

కోరలు చాస్తున్న క్యాన్సర్ !

పేద,సామాన్య కుటుంబాల్లో క్యాన్సర్ తో బాధపడుతున్న ఒక వ్యక్తి ఉంటే.. ఆయా కుటుంబాలు వ్యధను అనుభవించడం తోపాటు ఆర్థికంగా సతమతమవుతున్న సందర్భాలను చూస్తున్నాం. కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తూ పెద్దదిక్కుగా ఉండే వ్యక్తి క్యాన్సర్ బారిన పడితే పరిస్థితి మరీ దయనీయంగా మారుతోంది. క్యాన్సర్ ప్రభావిత పేదల కష్టాలకు అనేక కారణాలు కనిపిస్తున్నాయి. చాలా ప్రభుత్వ ఆసుపత్రులలో క్యాన్సర్ వ్యాధికి వైద్యం అందించేందుకు వీలుగా అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులో లేవు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో క్యాన్సర్ కు వైద్యం పొందాలంటే విపరీతమైన ఖర్చు అవుతోంది.

ఇది పేద సామాన్య కుటుంబాలకు పెనుభారంగా మారుతోంది. ధనికులు అత్యాధునిక వైద్య సదుపాయాలను పొందుతుంటే.. పేద సామాన్య ప్రజలు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ప్రపంచవ్యాప్తంగాను కనిపిస్తోంది. ప్రపంచ జనాభాలో సుమారు 92 శాతం మంది స్వయంగా లేదా కుటుంబ సభ్యుల ద్వారానో క్యాన్సర్‌ను ఎదుర్కోబోతున్నారన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ), అంతర్జాతీయ క్యాన్సర్ పరిశోధన సంస్థ (ఐఏఆర్‌సి) సంయుక్తంగా విడుదల చేసిన తాజా నివేదిక ఆందోళన కలిగిస్తోంది . సన్నిహిత కుటుంబ సభ్యులు ఈ వ్యాధి బారిన పడిన కారణాలతో కలిపితే 92 శాతం మంది జీవితంలో కనీసం ఒక్కసారైనా క్యాన్సర్ వల్ల ప్రభావితమవుతున్నట్లు నివేదిక వివరించింది. ఈ వ్యాధి వల్ల లక్షలమంది శారీరక, భావోద్వేగ, ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపింది. క్యాన్సర్ కేవలం ఒక వ్యాధి కాదు, అది ప్రపంచ ఆరోగ్య, ఆర్థిక వ్యవస్థలను, కుటుంబాలను తీవ్రంగా కుదిపేయనున్న ఒక సామాజిక సంక్షోభమని ఈ నివేదిక హెచ్చరిక చేసింది.


2024లో ప్రపంచవ్యాప్తంగా రెండు కోట్ల 60 లక్షలకు పైగా కొత్తగా కేసులు నమోదు కావడం, దాదాపు 97 లక్షల మంది మరణించడం ద్వారా క్యాన్సర్ ఎంత వేగంగా విస్తరిస్తుందో అర్థమవుతోంది . ఇందులో అత్యంత ఆందోళనకరమైన అంశం ఏమంటే, మరణించిన వారిలో 48 లక్షల మందికి పైగా 30-69 సంవత్సరాల మధ్య వయస్సు వారు కావడం. అంటే, కుటుంబాలకు ఆధారంగా ఉన్నవారు ఈ వ్యాధికి గురవుతున్నారు. ప్రతి తొమ్మిది మంది పురుషుల్లో ఒకరు, ప్రతి 13 మంది స్త్రీలలో ఒకరు 75 ఏళ్లు నిండకముందే క్యాన్సర్‌తో ప్రాణాలు కోల్పోతున్నారని ఈ నివేదిక తెలిపింది. పురుషుల్లో ఎక్కువ మంది ఊపిరితిత్తుల క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్ కు, మహిళల్లో అత్యధికులు రొమ్ము క్యాన్సర్ కు గురవుతున్నారు.

ఏటా నాలుగు లక్షల మంది పిల్లలు, యుక్తవయస్కులు క్యాన్సర్ బారిన పడుతుండటం, వారిలో అధిక శాతం పేద, మధ్య ఆదాయ దేశాలకు చెందినవారే కావడం మరో బాధాకరమైన వాస్తవం.అలాగే, క్యాన్సర్ బాధితుల్లో కనీసం 45 శాతం మంది తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆరోగ్య బీమా సదుపాయాలు ఉన్న దేశాల్లో సైతం, చికిత్స ఖర్చులు కుటుంబాలను దివాలా అంచుకు నెట్టివేస్తున్నాయని నివేదిక స్పష్టం చేసింది. అధిక ఆదాయ దేశాల్లో రొమ్ము క్యాన్సర్ బాధితుల్లో 85 శాతానికి పైగా కనీసం ఐదేళ్లు జీవించగలుగుతుంటే, తక్కువ ఆదాయ దేశాల్లో 45 శాతం మంది మాత్రమే అలా జీవించగలుగుతున్నారు. ప్రపంచ జనాభాలో దాదాపు 47 శాతం మందికి ప్రాథమిక వ్యాధి నిర్ధారణ సేవలు అందుబాటులో లేవు.

మన దేశంలో కూడా క్యాన్సర్ వ్యాధి వేగంగా విస్తరిస్తుంది. డబ్ల్యూహెచ్ఓ గ్లోబల్ స్టేటస్ రిపోర్ట్ ఆన్ క్యాన్సర్ 2026 ప్రకారం, 2024లో భారత్‌లో సుమారు 16 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు, 9 లక్షల మరణాలు నమోదయ్యాయి. 2050 నాటికి ఏటా కొత్త కేసులు 28 లక్షలకు చేరుకోవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రతి పదిమంది భారతీయుల్లో ఒకరు 75 ఏళ్లు నిండకముందే క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందని గ్లోబోకాన్ హెచ్చరిస్తోంది. అయితే, భారత్‌లో క్యాన్సర్ తీరుతెన్నులు పాశ్చాత్య దేశాల కంటే భిన్నంగా ఉండటం గమనార్హం. మహిళల్లో రొమ్ము క్యాన్సర్ అధికంగా ఉండగా, పురుషుల్లో పొగాకు వినియోగం కారణంగా నోటి క్యాన్సర్ ప్రధాన సమస్యగా ఉంది. గుట్కా, పాన్ మసాలాలు నిషేధించినట్లు ప్రభుత్వాలు చెబుతున్నా..అవి విస్తారంగా అందుబాటులో వుంటున్నాయి.

ఈ నేపథ్యంలో ప్రత్యేక పర్యవేక్షణతో ఇవి అందుబాటులో లేకుండా చూడాలి. వేగవంతమైన పట్టణీకరణ, మారుతున్న ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ తగ్గిపోవడం, వాయు కాలుష్యం ఇవన్నీ కలిసి క్యాన్సర్ కు కారణమవుతున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఆరోగ్య సేవల్లో అంతరాలు పెరుగుతున్నాయి. మెట్రో నగరాల్లో అందుబాటులో ఉన్న అత్యాధునిక చికిత్సలు సమీప గ్రామీణ జిల్లాలకు చేరడం లేదు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వ విధానాలు మారాలి. నేడు క్యాన్సర్ కు ఆధునిక వైద్య చికిత్సలు ఎన్నో అందుబాటులోకి వచ్చాయి. ఎంత త్వరగా వ్యాధి నిర్ధారణ చేయగలిగితే అంత సమర్థంగా రోగికి వైద్యం అందించేందుకు వీలు కలుగుతుంది. తద్వారా ఎంతోమంది రోగులు సాంత్వన పొందుతున్నారు. క్యాన్సర్లకు కారణం అవుతున్న పొగాకు వంటి వినియోగాన్ని ప్రభుత్వాలు అరికట్టడంతో పాటు, ఆరోగ్యకరమైన జీవన విధానం తో ప్రజలు మెలగటం అవసరం. దేశంలో సమగ్ర క్యాన్సర్ కేంద్రాలు, డే కేర్ క్యాన్సర్ కేంద్రాల సంఖ్య పెంచాలి. క్యాన్సర్ ఔషధాలు కూడా అందుబాటు ధరల్లో ఉండాలి. క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహించాలి. వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో విస్తృతమైన ప్రచారం కల్పించాలి. క్యాన్సర్ బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూనే.. మరోపక్క వ్యాధి తో బాధపడిన వారికి ప్రభుత్వాలు భరోసాగా నిలవాలి. క్యాన్సర్ ను జయించిన వారి విజయగాథ లను వివరించి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపాలి.

18న చాగంటి ప్రవచనాలు



పెందుర్తి, జననేత న్యూస్: వేపగుంట వద్ద గల మీనాక్షి కన్వెన్షన్‌లో ఈనెల 18వ తేదీన బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ధర్మవర్ధిని ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం 18వ తేదీ శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమవుతుందని, 6.30 గంటలకు ప్రత్యేక గోపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గోమాత వైభవంపై చాగంటి ప్రవచనాలు చెప్తారని, అందరికీ ప్రవేశం ఉచితమని తెలిపారు.

మొదటిపేజీ తరువాయి :

తొలి రథయాత్ర

20న నృసింహావతారం, 21న వామనావతారం, 22న పరశు రామావతారం, 23న రామావతారం, 24న బలరామ, కృష్ణావతారం, 25 తొలి ఏకాదశి రోజున శేషపాన్పుపై స్వామి వారు దర్శనమిస్తారు. రథోత్సవ సంబరాల సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి టి. రాజగోపాల్ రెడ్డి తెలిపారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో కూడా విశాఖలో రథాయాత్ర జరగనుంది. 16 సాయంత్రం 4 గంటలకు జీవీఎంసీ మహాత్మాగాంధీ విగ్రహం సమీపం నుండి ప్రారంభం కానున్న రథాయాత్ర సిరిపురం గురజాడ కళాక్షేత్రానికి చేరుకుంటుంది.

సీపీని సత్కరించిన జేసీఐ



విశాఖపట్నం, జననేత న్యూస్: జేసీఐ అంతర్జాతీయ మానవ విధుల ఉత్సవంలో భాగంగా జేసీఐ వైజాగ్ స్మార్ట్ అధ్యక్షురాలు జేఎఫ్ఎఫ్ మోనికా శ్రీనివాస్ మూడురోజులపాటు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. 'ఒక ప్రభుత్వ సేవకుడికి ధన్యవాదాలు' అనే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ అధికారులను సత్కరించారు. ఈ మేరకు విశాఖ పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చిని ఘనంగా సన్మానించారు. నగర సీపీ ఇచ్చిన మద్దతు, ప్రోత్సాహానికి జేసీఐ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సముద్ర భద్రతపై ప్రత్యేక అవగాహన



విశాఖపట్నం, జననేత న్యూస్: ఆంధ్రప్రదేశ్ కోస్టల్ సెక్యూరిటీ పోలీసుల ఆధ్వర్యంలో విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లోని ఆంధ్రప్రదేశ్ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ సమావేశ మందిరంలో మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ల యజమానులు, డ్రైవర్లకు సముద్ర భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుమారు 100 మంది మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ల యజమానులు, డ్రైవర్లు హాజరయ్యారు. సముద్రంలో చేపల వేటకు వెళ్లే ప్రతి మెకనైజ్డ్ ఫిషింగ్ బోటులో ట్రాన్స్‌పాండర్లు, లైఫ్ బోయ్‌లు, లైఫ్ జాకెట్లు తప్పనిసరిగా అమర్చుకొని వినియోగించాలని, అదేవిధంగా వీహెచ్ఎఫ్/మెరైన్ కమ్యూనికేషన్ ఫ్రీక్వెన్సీని నిరంతరం వినియోగిస్తూ సంబంధిత అధికారులతో సమాచారాన్ని పంచుకోవాలని సూచించారు. ఈ భద్రతా పరికరాల వినియోగం ద్వారా సముద్ర ప్రయాణాల్లో జరిగే ప్రమాదాలను నివారించడంతో పాటు తుఫానులు, ఇంజిన్ లోపాలు, బోటు దెబ్బతినడం, ఇతర అత్యవసర పరిస్థితులు, పొరపాటున ఇతర రాష్ట్రాల సముద్ర సరిహద్దుల్లోకి వెళ్లే సందర్భాల్లో సకాలంలో సమాచారం అందించి ప్రాణనష్టాన్ని నివారించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మైలపిల్లి లక్ష్మణరావు, విశాఖ డాల్ఫిన్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వీర్రాజు, విశాఖ కోస్టల్ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బర్రి కొండబాబు, ఎల్.బి.ఎస్.వర్ధన్, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ కె.ఆశా జ్యోతి, ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎస్.రమేష్, ఎస్.సురేష్, బి.కె.వి.ప్రసాద్, ఏఎస్ఐ ఎం.శ్రీను బాబు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీలో ఏఎంసీ విద్యార్థుల ప్రతిభ



విశాఖపట్నం, జననేత న్యూస్ : తిరుపతిలోని ఎస్.వి. మెడికల్ కాలేజీలో జూలై 7 నుండి 12 వరకు జరిగిన డాక్టర్ ఎన్.టి.ఆర్. యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి అంతర్-కళాశాల మెడికల్, డెంటల్ కళాశాలల క్రికెట్ టోర్నమెంట్‌లో విశాఖపట్నంలోని ఆంధ్ర మెడికల్ కాలేజీ క్రికెట్ జట్టు మూడవ స్థానాన్ని సాధించింది. కెప్టెన్ మురళీ మనోహర్ (హౌస్ సర్జన్) నాయకత్వంలోని ఈ జట్టు అద్భుతమైన సమష్టి కృషి, పట్టుదల, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి గొప్ప విజయాన్ని అందుకుంది.

ఈ సందర్భంగా కళాశాలకు కీర్తిని తెచ్చినందుకు గాను కెప్టెన్ మురళీ మనోహర్, వైస్-కెప్టెన్ ఎ.రజిత్ రెడ్డి (2022 బ్యాచ్), జట్టు సభ్యులందరినీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎం. సంధ్యా దేవి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎస్.ఎన్.పాత్రుడు, విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి బి.ఆదిత్య రెడ్డి అభినందించారు. జట్టు ప్రదర్శనను ప్రిన్సిపాల్ ప్రశంసించడమే కాకుండా, భవిష్యత్తు టోర్నమెంట్లలో మరింత గొప్ప విజయాన్ని సాధించి ఆంధ్ర మెడికల్ కాలేజీకి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

విశాఖ కు కొత్త ఎలక్ట్రికల్ బస్సులు

ఎయిర్ పోర్ట్ నుండి ప్రారంభోత్సవం చేయడానికి ఏపీఎస్ఆర్టీసీ అన్ని విధాల సిద్ధం చేస్తుందని విశాఖపట్నం రీజనల్ మేనేజర్ బి. అప్పలనాయుడు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రారంభోత్సవానికి ఆదేశాలు రావలసి ఉందని అన్నారు. ప్రధానంగా రెండు రూట్లో ఈ బస్సులు నడుపుతామని పేర్కొన్నారు. ఎన్.ఏ.డి. జంక్షన్, గురుద్వార్, వెంకోజిపాలెం, వుడా పార్కుల సమీపంలో విమాన ప్రయాణికుల సౌకర్యార్థం, వారు విశ్రాంతి తీసుకోడానికి , జిఎంఆర్ ఆధ్వర్యంలో అధునాతన లాంజస్ ఏర్పాటు కానున్నాయని, దీనికి కావలసిన అనుమతులు రావాల్సి ఉందని పేర్కొన్నారు. వచ్చిన ఈ 20 ఎలక్ట్రికల్ బస్సులలో, 10 బస్సులు గాజువాక నుండి ఎన్ఏడి, గురుద్వార్, మద్దిలపాలెం, హనుమంతవాక, మధురవాడ, ఆనందపురం, తగరపువలస మీదుగా భోగాపురం ఎయిర్పోర్ట్ కు. చేరుకుంటాయి. అలాగే మిగతా 10 బస్సులు గాజువాక, సింధియా, రైల్వే స్టేషన్, ద్వారకా బస్ స్టేషన్, వుడా పార్క్, ఋషికొండ, ఐటి హిల్స్, మారికివలస, ఆనందపురం, తగరపువలస మీదుగా, భోగాపురం ఎయిర్ పోర్ట్ కు చేరుకుంటాయి. ఇప్పుడున్న ట్రాఫిక్ ప్రకారం గాజువాక నుండి భోగాపురం ఎయిర్పోర్ట్ కు, గంటన్నర నుండి రెండు గంటల సమయం పట్టవచ్చని తెలియజేశారు. దీన్ని మరింత తగ్గించడానికి ప్రయత్నం చేస్తున్నామని తెలియజేశారు.

ఈ తనిఖీలో భాగంగా, ఎలక్ట్రికల్ బస్సు కంపెనీ ఇంజనీర్స్, డ్రైవర్స్, ఆర్టీసీ నుండి డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ పద్మావతి , గాజువాక డిపో మేనేజర్ మల్లేశ్వరరావు , అసిస్టెంట్ ఇంజనీర్స్ కె. యస్.డి.ప్రసాద్ , వివిధ డిపో ల నుండి వచ్చిన సేఫ్టీ డ్రైవింగ్ ఇన్స్పెక్టర్లుపాల్గొన్నారు.

ముద్రగడకు కన్నీటి వీడ్కోలు

దేహానికి రాజకీయ ప్రముఖులు, ప్రజలు, అభిమానులు నివాళులు అర్పించారు. అభిమానులు కిర్లంపూడికి పోటెత్తారు. కడసారి ఆయనను చూసేందుకు భారీ సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు, అభిమానులు.. అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ముద్రగడ పద్మనాభం కుటుంబ సభ్యులు కీలక నిర్ణయం తీసుకున్నారు. మాజీ మంత్రిగా ప్రభుత్వం ముద్రగడ అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు సీఎం చంద్రబాబు నాయుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయితే కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ముద్రగడ పద్మనాభం కుటుంబసభ్యులు తిరస్కరించారు. దీంతో..కిర్లంపూడి లోని ముద్రగడ నివాస ప్రాంగణంలోనే అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించారు. ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఆయన కుటుంబ సభ్యులు విభేదించారు. ముద్రగడ కుమార్తె క్రాంతి చివరి చూపు కోసం కిర్లంపూడికి వచ్చే ప్రయత్నం చేయగా.. పోలీసులు అడ్డుకున్నారు. కుటుంబ సభ్యుల అభ్యంతరాలతోనే అడ్డుకున్నట్లు చెబుతున్నారు. కాగా, మంత్రులు.. పలువుకు కాపు సంఘాల నేతలతో పాటుగా ఆయన మద్దతు దారులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ముద్రగడకు నివాళి అర్పించారు.

2027 మార్చి నాటికి పోలవరం

ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేఎల్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సభలో కేఎల్ రావు కుమారుడు కేఎల్ విజయరావుతో పాటు మంత్రులు నిమ్మల రామానాయుడు, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగిస్తూ.. సాగునీటి రంగానికి మహోన్నత సేవలు అందించిన కేఎల్ రావు స్ఫూర్తిని ప్రతీ గ్రామానికీ తీసుకెళ్లేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. “విజయవాడ గడ్డపై పుట్టి, ఎంపీగా గెలిచి.. ముగ్గురు ప్రధానుల వద్ద కేంద్రమంత్రిగా పనిచేసిన ఘనత కేఎల్ రావుది. శ్రీశైలం, నాగార్జున సాగర్, హీరాకుడ్, కోసీ లాంటి ప్రతిష్టాత్మక డ్యామ్‌ల నిర్మాణంలో ఆయన పాత్ర మరువలేనిది. ఐక్యరాజ్యసమితి తరపున అంతర్జాతీయ జల నిపుణుడిగా ఈజిప్ట్, సూడాన్ వంటి దేశాలకూ ఆయన సేవలందించారు. బ్రిటీష్ కాలంలో సర్ ఆర్థర్ కాటన్ ధవళేశ్వరం బ్యారేజీ, కృష్ణా బ్యారేజీలు నిర్మిస్తే.. స్వతంత్ర భారతంలో వాటిని ఆధునీకరించి తెలుగు నేలను సస్యశ్యామలం చేసింది కేఎల్ రావు గారే. వారి తర్వాత ఎన్టీఆర్ సాగునీటి రంగాన్ని ఎంతగానో తీర్చిదిద్దారు. వీరంతా నాకు నిత్య స్ఫూర్తిప్రదాతలు” అని సీఎం కొనియాడారు. గతంలో పట్టిసీమ ప్రాజెక్టును కొందరు 'వట్టిసీమ' అంటూ అవహేళన చేశారని, ప్రాజెక్టు దండగ అన్నారని చంద్రబాబు గుర్తుచేశారు. స్ఫూర్తిప్రదాతలు” అని సీఎం కొనియాడారు. గతంలో పట్టిసీమ ప్రాజెక్టును కొందరు 'వట్టిసీమ' అంటూ అవహేళన చేశారని, ప్రాజెక్టు దండగ అన్నారని చంద్రబాబు గుర్తుచేశారు.

కూటమి, వైసీపీలకుసవాలుగా స్థానిక ఎన్నికలు

పోరాటానికి సై అంటున్నారు. సమస్యలతో సతమతమవుతున్న వివిధ వర్గాల ప్రజలను కలిసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇబ్బందుల్లో ఉన్న ప్రజలను కలుసుకోవడం ద్వారా వైసీపీని ప్రజలకు చేరువ చేయవచ్చనే ఆలోచనతో కనిపిస్తున్నారు. మరోపక్క 25 నెలల పాలన పూర్తి చేసుకున్న కూటమి ప్రభుత్వం తమ పట్ల ప్రజల్లో పూర్తి సానుకూలత ఉందని చెబుతోంది. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్న నేపథ్యంలో తమకు ప్రజలు అండగా నిలుస్తారనే ధీమాతో కూటమి నేతలు ఉన్నారు. 2029 ఎన్నికల్లో నూ పొత్తులు కొనసాగుతాయని తిరిగి గెలుస్తామని కూటమి నాయకులు ఘంటాపథంగా చెబుతున్నారు . ఇది ఇలా ఉండగా మాజీ సీఎం జగన్ ప్రభుత్వం పైన గురి పెట్టారు. కూటమి పాలన పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని.. తిరిగి వైసీపీ అధికారంలోకి రావటం ఖాయమని పదే పదే అంటున్నారు .

ఈ సమయంలోనే మహిళా రిజర్వేషన్లు.. డీలిమిటేషన్ దిశగా కేంద్రం వేస్తున్న అడుగులు ఆసక్తి కరంగా మారుతున్నాయి. ఈ బిల్లులు ఆమోదం పొంది.. 2029 ఎన్నికల్లో అమలు చేస్తే.. మొత్తం లెక్కలు మారే అవకాశం ఉంది.కాగా సీఎం చంద్రబాబు తాజాగా కీలక అంశాన్ని ప్రస్తావించారు. సెప్టెంబర్ - అక్టోబర్ లో ఏపీలో స్థానిక ఎన్నికలు జరుగుతాయనే సంకేతాన్ని ఇచ్చి..ఇందుకు సిద్దం కావాలని పార్టీ శ్రేణులకు సూచించారు. మొదట మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని, ఆ తర్వాత గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరపాలని ప్రాథమికంగా ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఇటు అధికారంలో ఉన్న కూటమికి... అటు వైసీపీ సమర్థతకు ఈ ఎన్నికలు పరీక్షగా మారటం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే మాజీ సీఎం జగన్ పార్టీ నేతలకు ఈ ఎన్నికల పైన కీలక సూచనలు చేసినట్లు సమాచారం.ఎక్కడ ఎన్నిక జరిగినా.. పార్టీ అభ్యర్థి బరిలో ఉండాల్సిందేనని... ఇంఛార్జ్ ఇందుకు బాధ్యత వహించాలని స్పష్టం చేసినట్టు సమాచారం.

అటు కూటమి సైతం తమ రెండున్నరేళ్ల పాలన తరువాత జరిగే ఎన్నికలు కావటంతో ఇప్పటి నుంచే ప్రణాళికలను అమలు చేస్తోంది. ఇప్పటి నుంచే పార్టీ క్యాడర్ అంతా రంగంలోకి దిగాలని చంద్రబాబు కోరారు. ముందుగా మున్సిపల్, తరువాత దశల వారీగా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగేలా ప్లాన్ చేస్తున్నారు. దసరా తరువాత ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. దీంతో.. 2029 ఫలితాల పైన మాట్లాడుతున్న కూటమి- వైసీపీకి ఈ ఎన్నికలు సవాల్ గా మారటం ఖాయంగా కనిపిస్తోంది.

ఏయూ లో దుర్గాబాయి దేశ్ ముఖ్ జయంతి



ఏయూ, జననేత న్యూస్ : స్వాతంత్ర్య సమరయోధురాలు , భారత రాజ్యాంగం కమిటీ మహిళా సభ్యురాలు దుర్గాబాయి దేశ్ ముఖ్ జయంతిని ఆంధ్ర యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో నిర్వహించారు. విభాగాధిపతి ప్రొఫెసర్ పేటేటి ప్రేమానందం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జాలాది రవి హాజరై దుర్గాబాయి జీవిత విశేషాలను వివరించారు.ఆమె ఆంధ్రా యూనివర్సిటీలో పాలిటిక్స్ విభాగంలో ఎంఏ రాజనీతి శాస్త్రం చదివారని, తర్వాత స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీ, నెహ్రూలతో పనిచేసి రాజ్యాంగ రచనా కమిటీకి ఎన్నికై, మహిళల హక్కులను రాజ్యాంగంలో చేర్పించడానికి విశేష కృషి చేసారని తెలియజేసారు. ఆమె జీవితమంతా నీతి, నిజాయితీతో ప్రజాసేవ చేసారని , అటువంటి మహనీయురాలను స్మరించుకోవడం మనందరికీ గర్వ కారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు పరిశోధకులు, ఇన్కమ్ టాక్స్ అధికారి డా.అనిల్, విభాగ అధ్యాపకులు డా.కె.సత్యనారాయణ, డా.హరిబాబు, డా.రత్నరాజు, డా.సొనాలి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు.. రోగులకు సేవలపై సమీక్ష



విశాఖపట్నం, జననేత న్యూస్ : జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ సమావేశ మందిరం లో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.పి.జగదీశ్వర రావు, జిల్లా ప్రోగ్రాం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, స్క్రబ్ వైరస్ వ్యాధి ఎలా సోకుతుంది, లక్షణముల గురించి వివరణ అడగగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి స్క్రబ్ వైరస్ వ్యాధి గురించి వివరంగా తెలియజేశారు . టైఫాయిడ్ కేసుల పై ఆరా తీశారు.జీవీఎంసీ వారితో సమన్వయం చేసుకుని టైఫాయిడ్ కేసుల అనాలసిస్ చేసుకుని ఆ ప్రాంతంలో నియంత్రణ చర్యలు తీసుకోవాలని డి.ఎస్.ఓని ఆదేశించారు. మలేరియా కేసులు కిందటి సంవత్సరం కంటే తక్కువ నమోదవ్వడం ఆనందదాయకం అని తెలియజేశారు. డెంగ్యూ కేసులు విషయం లో ఆంధ్రాలో మొదటి స్థానంలో విశాఖపట్నం ఉండటం క్షేమదాయకం కాదని ఈ విషయాలు సోషల్ మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ సమీక్షలో పలు వ్యాధులకు సంబంధించి కేసుల వివరాలు, తీసుకుంటున్న చర్యలు గురించి కలెక్టర్ తెలుసుకొని తగు సూచనలు చేశారు. పలు ఆరోగ్య కార్యక్రమాల ద్వారా రోగులకు అందిస్తున్న సేవలు గురించి సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో డా. ఆర్ రమేష్, డి.ఏ.ఎల్.టీ.ఓ, డా. లూసి, డీ.ఐ.ఓ. డా.బి.ఉమావతి, డిపిఎంఒ, డెమో బి. నాగేశ్వరరావు, డా.బి. హారిక, అర్.బి.ఎస్.కే జిల్లా సమన్వయకర్త, డా. ఎన్. వి. సమత, విమెన్ హెల్త్ ఆఫీసర్, ఇతర జిల్లా ప్రోగ్రాం అధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ ఆసుపత్రికి రూ.లక్ష విరాళం



విశాఖపట్నం, జననేత న్యూస్: విశాఖపట్నం లయన్స్ క్లబ్ జాయింట్ సెక్రటరీ లయన్ లక్ష్మీనారాయణ రావు నృసింహదేవర తన 70వ జన్మదినాన్ని పురస్కరించుకుని, సతీమణి లయన్ భానుమతితో కలిసి విశాఖపట్నంలోని లయన్స్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అభివృద్ధికి, ముఖ్యంగా రోగులకు, ఆసుపత్రిలో ఉన్నవారికి స్వచ్ఛమైన తాగునీరు, అలాగే ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు గాను రూ. 1,00,000/- విరాళంగా అందించారు. ఈ విరాళం చెక్కును ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ లయన్ డాక్టర్ వి.ఉమామహేశ్వరరావు స్వీకరించారు. ఆసుపత్రిలో తన 70వ జన్మదిన వేడుకలు జరుపుకున్నందుకు లయన్ లక్ష్మీనారాయణ రావుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ శుభ సందర్భంగా లక్ష్మీనారాయణరావు దంపతులను ఆసుపత్రి యాజమాన్యం ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ ఎన్.వి.ఎన్. దుర్గాప్రసాదరావు, సెక్రటరీ లయన్ వి.చంద్రమౌళి, ట్రెజరర్ లయన్ జి.సి.జైన్, వైస్ ప్రెసిడెంట్ లయన్ పి.ఎం.జి.శంకర్, ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ మోహన్ పాత్రో, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కళ్యాణ్ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లయన్ లక్ష్మీనారాయణ రావు తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో కూడా ఆసుపత్రి అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని యాజమాన్యానికి హామీ ఇచ్చారు.